# త్రైలోక్యగీత
# షోడశాధ్యాయము
# విశ్వమత సమన్వయ యోగము

**త్రైలోక్యా ఉవాచ:-**
**దత్త! సద్గుణ వారాశే!, ప్రశంసార్హాఽస్మి నత్వహమ్ |**
**హైందవస్యేవ కిం సాధ్యః, వైశ్వో మత సమన్వయః? ||16.1||**

[**కుమారి త్రైలోక్య అడిగింది:-** ఓ దత్త దేవ! తమరు సర్వసద్గుణ సాగరులు. మిమ్ము కీర్తించ సామర్థ్యము ఉన్న దానను కాను. హిందూమతములో అనేక ఉపమతములు సమన్వయముతో ఉన్నట్లు, విశ్వములో ఉన్న అన్ని మతములను ఏకీకృతము చేయడము సాద్యమేనా?]

**దత్త స్వామీ ఉవాచ:-**
**దత్తోక్తా స్త్వద్గుణాః స్సత్యాః, త్వయోక్తాశ్చ శ్రుతాః స్మృతాః |**
**యశసే న విరక్తోఽస్మి, భక్తాయ గురవే క్రమాత్ || 16.2||**
[**శ్రీశ్రీశ్రీ దత్త స్వామి వచించారు:-** నీ సద్గుణములు సత్యమే అయి ఉండాలి, ఎందుకంటే అవి దత్తదేవుని చేత చెప్పబడినాయి. దత్త భగవానుని ఉద్దేశించి నీవు కీర్తించిన సద్గుణములు కూడా నిజమే అయి ఉంటాయి ఎందుకంటే దత్త భగవంతుడు నీ కీర్తనలు విని, స్వీకరించినారు. నిరంతరము ఊర్ధ్వ లోకాలలో పొందెడి అనంతమైన కీర్తి చేత వెగటు పొంది ఉండటము చేత దత్తదేవుడు ప్రాపంచిక కీర్తిని కోరడము లేదు. నీ గుణస్వభావములు ఇక్కడ చెప్పబడినవి. ఎందుకంటే అవి భక్తులను సద్భక్తులుగా మారుటకు ప్రేరణ కలిగిస్తాయి. **నా** సద్గుణములు ఇక్కడ చెప్పబడినవి ఎందుకంటే అవి లోకములోని ఆధ్యాత్మిక గురువులను మంచి ఆధ్యాత్మిక గురువులుగా మారుటకు ప్రేరణ కలిగిస్తాయి.]

**అహంతా విజితా ప్రోక్తా, త్రైలోక్యే వచసా తవ |**

**సత్యం నిత్యం వచో యోగ్యం, తద్ధి జ్ఞానస్య లక్షణమ్ || 16.3||**

[ఓ త్రైలోక్య! **నా**చే గుర్తింపబడిన నీ సద్గుణముల యోగ్యత నీకు లేదని విన్నవిస్తూ నీవు అహంకారమును జయించినావనే విషయమును పరోక్షముగా తెలిపావు. సత్యమైనదేదో దానిని మాత్రమే పలుకవలెను. ఆధ్యాత్మిక జ్ఞానమునకు కూడా ఇదే సత్యము వర్తిస్తుంది. దీని సారాంశమేమంటే, సత్యమైన ఆధ్యాత్మిక జ్ఞానమునే ఆధ్యాత్మిక గురువు ఎల్లవేళల ప్రబోధించవలెను.]

**త్వదీర్ష్యా భక్త పీడా చేత్, ఆశంకా తన్ముఖాత్సతః |**
**తద్వృద్ధి స్స్యా న్న గణ్యంతే, జీవ పూర్వార్థ సంచయాః || 16.4||**

[ మానవసహజమైన అసూయ చేత కొందరు భక్తులు నిన్ను ప్రశంసించడము చూసి బాధపడతారేమోనని భావించి **నా**చేత చెప్పబడిన సద్గుణములకు ఒకవేళ నీవు, నీకు యోగ్యత లేదంటావేమో! నీకలాంటి సంశయమే వద్దు, కారణమేమంటే, ప్రతి గుణమునకు మంచి చెడులనే రెండు ముఖములు ఉన్నాయి. ఒకవేళ అసూయ తన మంచి ముఖములోకి త్రిప్పబడితే ఎవరైనా చెప్పలేనంతగా స్వయం వృద్ధి చెందుతారు. ఈ విధముగా నీవు ఆయా భక్తులకు ఆధ్యాత్మిక మార్గములో చక్కగా పురోగతి చెందుటకు సహకరిస్తున్నావు. కొన్నిసార్లు కొందరు దాచుకున్న ఫిక్సెడ్ డిపాజిట్ ల గురించి తెలియనందున వర్తమాన బ్యాంకు అకౌంట్ ఆధారంగా చిన్నచూపు చూడబడతారు. అదే విధముగా కొందరు భక్తులు భక్తి స్థాయిలోనో లేక కర్మ స్థాయిలోనో కనిపిస్తారు కాని మొదటి మెట్టైన జ్ఞాన స్థాయి లేనందున వారు నిరక్షరులుగా చిన్నచూపు చూడబడతారు. శివదత్తునికి భక్తుడైన ఒక వేటగాడు నిజానికి తన పూర్వ జన్మలో అర్జునుడు, సాక్షాత్ జగద్గురువైన శ్రీకృష్ణదత్తుని వద్ద ఆధ్యాత్మిక జ్ఞానము నేర్చుకొన్న జిజ్ఞాసువు అయినప్పటికీ తను నిరక్షరుడుగా చిన్నచూపు చూడబడినాడు, ఎందుకంటే గతజన్మలో తన ఆధ్యాత్మిక జ్ఞానము (ఫిక్సెడ్ డిపాజిట్)

ఇప్పుడు గుర్తు కోల్పోయినది. ఒక్క సద్గురువు లేదా వర్తమాన నరావతారమునకు మాత్రమే జీవాత్మల యొక్క భూత, వర్తమాన, భవిష్యత్తులు తెలుస్తాయి. (**తాన్యహం వేద సర్వాణి..** గీతా)]

**శంకరేణ హైందవైక్యం, వివేకానందతో జగత్ |**
**హైందవం సూక్ష్మ సిద్ధాంతః, స్థూలం వైశ్వం నయ స్సమః || 16.5||**

[ ఆదిశంకరాచార్యులు హిందూమతములోని ఉపమతాలన్నింటిని ఏకము చేసి హిందూ మతమును సంఘటితము చేశారు. శంకరులు ఉపయోగించిన అదే తర్కమును దత్తము చేసుకుని మనము కూడా ప్రపంచములోని మతాలన్నింటిని ఏకము చేయవచ్చును. ఒకవేళ ఒక ఇంట్లోని గదులన్నీ ఏకము చేయడానికి వాటి మధ్యనున్న గోడలన్నీ కూల్చితే ఒక పెద్ద ఇల్లుగా మారుతుంది కదా. మరి అలాంటి పెద్ద ఇళ్ల మధ్య ఉన్న గోడలను కూల్చివేసి మనము మరింత పెద్ద ఇల్లుగా చేయలేమా? ఈ విధంగా స్థూలవిశ్వమునకు ఒక సూక్ష్మ ఉదాహరణమై విశ్వములోని మతాలన్నీ ఏకమగుటకు, ప్రతిఫలముగా ఏకైక విశ్వమతమును స్థాపించగలము అనుటకు ఐక్యత గల హిందూమతము మంచి ఉదాహరణ. ఆదిశంకరాచార్యులు హిందూమతమును ఏకము చేస్తే, వివేకానందుడు విశ్వమతములను ఏకము చేయడానికి ప్రయత్నించారు.]

**అదృశ్యానూహ్య మస్మాకం, అదృశ్యోహ్య శివస్య చిత్|**
**దృశ్యోహ్యూపధిష్వేకం, మతోపమత సామ్యతా || 16.6||**

[ఆదిశంకరాచార్యులు ఆలంబనము 'చైతన్యము', ఇది ఊహించదగినది (సృష్టించబడినది) కాని కళ్ళతో నేరుగా చూడలేనట్టి అదృశ్యమైన ఆత్మ అనబడే అంతర్లీనమైన ఒకే ఒక భగవంతుడు లేదా బ్రహ్మము. నేడు శ్రీదత్తస్వామి తీసుకున్న ఆలంబనము, అనూహ్యమైన మరియు అదృశ్యమైన

అంతర్లీనమైన ఒకే ఒక భగవంతుడు లేదా పరబ్రహ్మము (**UNIMAGINABLE GOD**). ఈ రెండు సందర్భాలలో అంతర్లీనమైన దైవము ఉమ్మడి స్వభావము ఏమిటంటే అదృశ్యమై ఉండటము ఒకటైతే, రెండవది బాహ్యమైన స్థూలశరీర మాధ్యమము. బాహ్యరూపాలు రెండు సందర్భాలలోను దృశ్యమైనవి మరియు ఊహించదగినవి. కావున అంతర్లీనమైన దైవము యొక్క సామ్యత ఆధారంగా చూస్తే ప్రపంచములో వివిధ మతాలలోను, వివిధ ఉపమతాలలోను గల వివిధ దేవీదేవతా రూపాలను ఏకీకరణము చేయడము అనే సాధారణ లక్ష్యము సాధించుటకు పైన చెప్పిన భేదము ఎలాంటి అవరోధము కాదు. అంతర్లీనమైన భగవంతుడు ఒక్కడే, అయినను అన్ని వేర్వేరు బాహ్యరూపాలలో ఉన్నాడనే సత్యము ఆధారముగా హిందుమతములోని ఉపమతాలు అన్నింటిలోను అంతర్లీనమైన భగవంతుడు ఒక్కడే అని స్పష్టమవుతున్నది. ఇదే సూత్రము ప్రపంచములోని అన్ని మతాలకూ వర్తిస్తుంది. ఆదిశంకరుల చేత వేర్వేరు హిందు ఉపమతముల మధ్య, మరియు శ్రీ దత్తస్వామి చేత ప్రపంచములోని వివిధ మతముల మధ్య ఐక్యత తీసుకురాబడినది ]

**నచైక్యం భిన్న వేషేసు, విద్యుద్వల్లీషు కేవలా |**
**భిన్న దేశేష్వపి స్పష్టం, అంతరైక్యం మతేష్వివ || 16.7||**

[శివకేశవులు మొదలైన దేవతా స్వరూపాలందరిలో, కేవలము బాహ్యరూపాలలో మాత్రమే భేదము ఉందని, అంతర్లీనమైన దైవము ఆత్మ లేదా బ్రహ్మము ఒక్కటేనని, ఉపమతాలకు సంబంధించిన దేవీదేవతారూపాలలో ఉన్నది కూడా ఆ ఒక్కటేనని ఆదిశంకరాచార్యులు నిరూపించారు. అలాగే అంతర్లీనమైన దైవము (ఒక్కటే పరబ్రహ్మము) ప్రపంచ మతాలకు సంబంధించిన దైవస్వరూప మాధ్యమములలో ఉన్నాడని శ్రీ దత్తస్వామి నిరూపించినారు. భగవంతుని రెండు రూపాలైన శివకేశవులు నిజానికి ఒక్కటే, ఎందుకంటే వారి యందు

అంతర్లీనమైన దైవము ఒక్కటే. బహిర్గతమైన మాధ్యమ (ఉపాధి) రూపాలలో మాత్రమే తారతమ్యాలు ఉన్నాయి కాబట్టి, శరీరమాధ్యమములోని భేదాలను గనక మనము విస్మరిస్తే, అంతర్లీనమైన భగవంతుని ఏకత్వము ఆధారముగా తానే శివదేవుడు, తానే విష్ణుదేవుడు అయినపుడు తానే యెహోవా తానే అల్లాహ్ ఎందుకు కారాదు? భగవానుడైన శివునిలోను, విష్ణు భగవానుని లోను నటిస్తున్న అంతర్లీనమైన నటుడు అయిన భగవంతుడు స్వయంగా తానే అయినపుడు, ఆ నటుడే యెహోవా మరియు అల్లాహ్ పాత్రలలో ఎందుకు నటించకూడదు? ఈ సిద్ధాంతము ఒక్క దేశానికి (భారతదేశము) మాత్రమే పరిమితమైనది కాదు, ఇది ఈ భూమి మీద ఉన్న ప్రపంచ దేశాలన్నింటికీ విస్తరించగలము. విద్యుత్ తీగలలో అంతర్లీనంగా ప్రవహించే విద్యుత్తు కోణము నుండి చూస్తే భారతదేశములోని రెండు విద్యుత్ తీగలు సమానమే అయినపుడు భూమి పైన గల ఇతర దేశాలలో విద్యుత్తు ప్రవహించే మరో రెండు విద్యుత్ తీగలతో ఈ రెండు విద్యుత్ తీగలు ఎందుకు సమానము కావు? ఈ విద్యుత్ తీగల బాహ్య రూపమైన శరీర మాధ్యమములలోనో లేదా విద్యుత్ తీగలు తయారుచేయబడిన లోహములలోనో, తీగల రంగులలోనో వైవిధ్యము తప్పక ఉండవచ్చును, కాని అంతర్లీనముగా ప్రవహించెడి విద్యుత్ ఒక్కటే అయినందున ఈ నాలుగు విద్యుత్ తీగలు సర్వసమానములు.]

**యంత్ర దృశ్యా చిదూహ్యా చ, నానాత్వాయ న నోహ్యతా |**
**నాస్తిత్వ శంకయా న్యస్తా, సాపి నోహ్యా విచారతః || 16.8||**

[మామూలు కంటికి ఊహించదగిన పదార్థముగా కనిపించని చైతన్యమే లోన ఉన్న భగవంతుడు అని జగద్గురు ఆదిశంకరాచార్యులు బోధించారు. ప్రస్తుత కాలములో ఈ చైతన్యము దృశ్యమానమైనది. శాస్త్రీయమైన పరికరముల అమరికలతో చూస్తే జడశక్తి యొక్క తరంగరూపాలుగా కనబడే చైతన్యము, మెదడు లోని నాడీవ్యవస్థలో పని చేస్తున్న జడశక్తి

యొక్క విశేషమైన క్రియారూపము అని స్పష్టమవుతున్నది. బంగారు ఆభరణమునకు బంగారము అనెడి లోహము ఎలాంటిదో అలాగే చైతన్యముకు సంబంధించి జడశక్తి అలాంటి కీలకమైన మూలపదార్థము. కావున నిజానికి చైతన్యము ఊహించదగినది, చూడగలిగినది. భగవంతుడు మూలాలన్నింటికీ మూలము. అంతేకాని చైతన్యము వంటి వాడు కాదు, ఎందుకంటే చైతన్యమును సృష్టించుటకు శరీరములో జడశక్తి మూలపదార్థము. ఇంకా లోతుగా శోధిస్తే చైతన్యమునకు మూలమైన జడశక్తి జీర్ణమైన ఆహరము నుండి ఉత్పన్నమైనది. ఏదేని శక్తిమంతమైన శరీరము లేదా పదార్థరూపమైన శరీరములో మాత్రమే చైతన్యమునకు అస్తిత్వము కలదు గాని, ఆధారభూతమైన శరీరము లేకుండా చైతన్యమునకు స్వతంత్రమైన అస్తిత్వము లేదు. ఈ విధముగా చైతన్యమునకు గల లోపాలన్నీ(వికారాలు) ఆదిశంకరాచార్యులకు తెలిసినప్పటికీ, జీవాత్మ లోని ఆ చైతన్యమునే భగవంతుడు అన్నారు! ఎందుకంటే తన ఆధ్యాత్మిక ప్రయాణములో నాస్తికులకు ఆధ్యాత్మిక జ్ఞానప్రచారము చేయవలసి ఉన్నది. కాని వారు భగవంతుని యందు విశ్వాసము లేనివారు, కాని తమలో ఆత్మ ఉన్నది అని విశ్వసిస్తారు. కాని ప్రస్తుతము వర్తమాన సద్గురువు శ్రీ దత్తస్వామి సిద్ధాంతములో ఆ లోపాలేవీ లేవు, ఎందుకంటే, ఆదిశంకరులు చెప్పిన రూపములేని చైతన్యము (దత్తస్వామి తెలిపిన పదము పరబ్రహ్మము) తేజోరూపాత్మక బాహ్య శరీరమాధ్యమమును లేదా పదార్థరూపమైన మానవబాహ్య శరీరములవంటి రకరకాలైన బాహ్య శరీరమాధ్యమములను ఏవైనా ధరించగలదు కావున శ్రీ దత్తస్వామి అనూహ్యపరబ్రహ్మముగా గుర్తించిన తత్త్వముతో సరిపోలుతుంది. అనూహ్య పరబ్రహ్మము వేర్వేరు శరీరమాధ్యమాలైన తేజోరూపాత్మక (అగ్ని) శరీరములోను, పదార్థస్వరూపమైన మానవ (పృథ్వీ) శరీరములోను కొలువై ఉంటుంది. కాని ఒకవేళ ఆదిశంకరుని తత్త్వములో మనము చైతన్యము స్థానములో అనూహ్య పరబ్రహ్మమును తీసుకుంటే, అది ఉత్తమోత్తమమైనది, కాబట్టి పైన తెలిపిన లోపాలు

సరిదిద్దబడతాయి. మరి చైతన్యము గురించి చర్చిస్తే మరొక కొత్త లోపము కూడా వచ్చి చేరవచ్చును, ఎందుకంటే, చైతన్యము సృష్టిలోని ఒకానొక అంశము, కావున సృష్టిలోని ఇతర అంశములైన శక్తి, పదార్థము మొదలైనవి అన్నీ చైతన్యముతో పోటీ పడవచ్చును (తామూ భగవత్స్వరూపాలు కాగలము అని), కారణము భగవంతుడు అవతరించుటకు జనులలో వివిధ రూపాలను ఎంచుకొనే అవకాశము ఉన్నది. భగవంతునికి ఈ విధముగా బహురూపత్వము సంభవిస్తున్నది. మనము అనూహ్య పరబ్రహ్మము విషయములో చూసినట్లైతే, బహురూపాత్మకత సంభవించదు, ఎందుకంటే విశ్వములో అనూహ్యమైన అంశములు ఎన్ని ఉన్ననూ అవి ఒకే అనూహ్య అంశముగా అంగీకరించబడతాయి, ప్రమాణమేమంటే భగవంతుడు ఒక్కడే. ఏది ఏమైనా ఆదిశంకరాచార్యులు చైతన్యమును భగవంతుడుగా ఎంచుకున్నది కేవలము నాస్తికులను దృష్టిలో ఉంచుకుని మాత్రమే కాదు, చైతన్యము ఊహించదగినది మరియు కనిపిస్తున్నది కాబట్టి సాధారణ జనుల మనసులలో కూడా భగవంతుడు ఉన్నాడు అనే కోణములో అనువర్తితమైనది. ఈ సత్య జ్ఞాన స్థాపన చేయడము కూడా జరిగినది. ఒకవేళ ఆదిశంకరులు పరమసత్యమైన అనూహ్య పరబ్రహ్మమునే భగవంతుడు అని ఎంచుకొని ఉంటే, సాధారణ జనులు అనూహ్యమైనది అంటున్నారు కాబట్టి ఉన్నాడో, లేదో అనే సంశయము ఆది లోనే పొందేవారు. యథార్థమేమిటంటే, ఆదిశంకరాచార్యులు ఈ చైతన్యమును **అనూహ్య చైతన్యము (పరబ్రహ్మము)** అన్నారు. ఎందుకంటే భగవంతుని చైతన్యము అనూహ్యమైనది, దానికి మూలకారణము అంటూ రెండవది లేదు. కాని మానవుల చైతన్యము అలాంటిది కాదు దీనికి మూలము పదార్థరూపమైన నాడీవ్యవస్థ. శరీరములో జీర్ణమైన ఆహారము నుండి జడశక్తి విడుదలై, శరీరభాగాలన్నింటికీ పంపబడినపుడు మెదడులోని నాడీమండలములోకి ఈ జడశక్తి చేరినపుడు చేసే విశేష కార్యరూపమే మానవ చైతన్యము. దీని సారాంశమేమిటంటే,

అనూహ్య పరబ్రహ్మము అంటే ప్రాపంచిక చైతన్యము కాదు, అంటే నాడీవ్యవస్థలో జడశక్తి సంచారము వలన ఉద్భవించినది కాదు. ఆదిశంకరాచార్యుల దృష్టిలో అనూహ్యచైతన్యము అంటే సర్వశక్తిమంతుడైన పరబ్రహ్మము యొక్క తెలుసుకునే తత్త్వము(చైతన్యము లేదా ఎరుక). దీనికి ఆధారము తన సర్వశక్తిమత్త్వము తప్ప తానే ప్రాపంచిక చైతన్యము అనే అర్థములో కాదు. కావున ఆదిశంకరాచార్యులు చెప్పిన అనూహ్య చైతన్యము మరియు శ్రీ దత్తస్వామి చెప్పిన అనూహ్యపరబ్రహ్మము రెండూ ఒకటే, వేర్వేరు కాదు.]

**నానామత బహిస్తత్త్వం, ఏకాధ్యాత్మాఽన్తరార్థ దృక్ |**
**వేషా భిన్నా నటో హ్యేకః, విశ్వాధ్యాత్మ హి తన్మతమ్ || 16.9||**

[మతాల మధ్య భేదమునకు ఆధారము చూడదగినవి మరియు ఊహించదగినవి అయిన బాహ్యశరీరమాధ్యమము యొక్క బాహ్య లక్షణాలు. కాని, ఆయా శరీరాలలో అంతర్లీనమైన దైవము లేదా భగవంతుడు అంతర్లీనముగా ఒక్కడే అయినప్పటికీ భిన్న అవతారములు బాహ్యములో వేర్వేరు ఆహారపు అలవాట్లతో, వేర్వేరు వేషధారణలతో, వేర్వేరు భాషాసంస్కారాలతో విభిన్న సంస్కృతులలో దర్శనము ఇచ్చినపుడు జనులు సులభముగా ఒక్కొక్క అవతారము ఒకదానితో ఒకటి విభేదిస్తాయని పొరబడతారు. భిన్న మతాలలో ఇలాంటి బాహ్యమైన కారణాలను అన్నింటిని ఏకము చేయడము అనేది సాధ్యమైన పని కాదు. ఎందుకంటే, అవి ఎల్లప్పుడు ఒకదానితో ఒకటి అనేక విషయాలలో విభేదిస్తూనే ఉంటాయి. కావున అటువంటి ఉపరితల ఏకత్వము మన లక్ష్యము కానేకాదు, ఎందుకంటే ఒకానొక నటుడు వేర్వేరు పాత్రలలో నటిస్తున్నప్పుడు ఆ వేర్వేరు బాహ్య పాత్రలన్నీ ఒకటే అని మనమెలా చెప్పగలము? మన ఉద్దేశము ఏమిటంటే, ఆయా వేర్వేరు పాత్రలలో నటించిన నటుడు ఒకడే అని తెలపడము. అదేవిధముగా, వేర్వేరు మతాలలో, వేర్వేరు రూపాలలో

(పాత్రలలో) ఉన్న భగవంతుని (నటుని) ఏకత్వమును ప్రతిష్ఠించడమే మన లక్ష్యము. అలాగే వేర్వేరు మతాలలోని వేర్వేరు పవిత్ర గ్రంథాలలో అంతర్లీనమైన సారము ఒక్కటేనని నిరూపించటము మన లక్ష్యము. కాని విభిన్న భాషలను ఏకీకరణము చేయటము గాని విభిన్న గ్రంథాలను ఏకీకరణము చేయటము గాని కాదు. బాహ్యములో ప్రదర్శితమయ్యే అంశములన్నీ మతము అనే గొడుగు క్రిందకు వస్తాయి, అంతర్లీనమైన సారంశములు అన్నీ ఆధ్యాత్మిక జ్ఞానముగా గుర్తింపబడుతుంది. కావున విశ్వైకమతము అంటే విశ్వైక ఆధ్యాత్మికత. ఇది అంతరంగములో స్థిరమైన ఆధ్యాత్మిక స్పందన, అంతేకాని బాహ్యములో మార్పులకు లోనయ్యే మతస్పందనలు కాదు. ]

**ఊహ్యానూహ్యౌ దృశ్యాదృశ్య-తేజోనరైకతాభిదః |**
**ధర్మ ముక్త్యాదయో ముఖ్యాః, విషయా న మతస్య తే || 16.10|**

[ఏ మత గ్రంథములోనైనా బోధింపబడిన ఆధ్యాత్మిక జ్ఞాన భావనలు ఎంతో కీలకమైనవి, అంతే కాని బాహ్యరూపములోని మతాచారములు కావు. ఆధ్యాత్మిక జ్ఞానంలోని ముఖ్యమైన భావనలు మతాలన్నింటిలోను ఒకటే సిలబస్ మాదిరిగా సమానముగా ఉంటాయి. అవి, 1. నిర్గుణ పరబ్రహ్మము ఊహించదగినదా? లేక అనూహ్యమా? 2. సగుణ బ్రహ్మము కనిపించే మానవరూపమా? లేక అదృశ్యమానమైన తేజోరూపమా? (అరుదుగా ఘోరతపస్సు ద్వారా తేజోరూపము కనిపించవచ్చును). 3. దైవము ఈ ప్రపంచమునకు వేరుగా, ఈ జీవాత్మలకు వేరుగా ఉన్న వాడా? లేక ప్రపంచము, జీవాత్మలతో ఒకడై ఉన్నాడా? 4. ప్రవృత్తి లేక ప్రాపంచిక జీవనవిధానమేమిటి? 5. నివృత్తి లేక ఆధ్యాత్మిక జీవితమేమిటి? మొదలైనవి.]

**దైవస్య స్వర్గ నరక- సత్తే సర్వత్ర దర్శితే |**

**అన్యాంశ సుసులభం యోజ్యః, ఉభే ముఖ్యే జగత్ కృతే || 16.11||**

[ముఖ్యమైన ఆధ్యాత్మిక జ్ఞాన భావనలు అన్ని మతాలలోను సరిసమానము. 1. దైవము ఉన్నాడు, ఆయన సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సర్వ వ్యాపకుడు. అయితే మనము సర్వ వ్యాపకుడు అనే అర్థము శాబ్దికముగా కాక ప్రభావితరూపములో తీసుకోవలెను. అంటే భగవంతుడు అంతటా లేకపోయినప్పటికీ ఆయన సర్వజ్ఞత చేత సర్వశక్తి చేత సృష్టి మొత్తము తెలిసి దానిని నియంత్రిస్తున్నవాడు. కారణమేమిటంటే శాబ్దిక అర్థములో సర్వ వ్యాపకత్వమును అంగీకరిస్తే దైవము చెడ్డ జీవాత్మ లలోను ఉన్నది అనే భావము స్ఫురిస్తుంది. 2. దైవము ధర్మమును రక్షిస్తుంది మరియు అధర్మమును ద్వేషించి, నాశనము చేస్తుంది. దైవము కోరిక మేరకు శిష్టులైనవారికి స్వర్గము, దుష్టులకు నరకము ఏర్పాటు చేయబడినాయి. దైవము చేత సృష్టించబడిన ఈ సృష్టిలో శాంతిని స్థాపించి శ్రేష్ఠమైన పరిపాలన చేయటము కొరకు స్వర్గనరకములు చాలా ముఖ్యమైనవి. వేరే ఇతర బాహ్య అంశములలో భేదాలు ఉంటే అవి, అతి సులభముగా పరిష్కరించబడతాయి.]

**నాస్తిక ప్రత్యయో నోహ్యో, వంచనా స్యాత్ పురో మతేః |**
**స్థాతవ్య మసదాశంక్య, కర్మాగార పతిర్యథా|| 16.12||**

[ప్రపంచములోని మతాలన్నింటిని వ్యతిరేకించే ఒకే ఒక మతము నాస్తికత్వము. వీరు దైవము యొక్క అస్తిత్వమును గాని స్వర్గ నరకముల అస్తిత్వమును గాని విశ్వసించరు. ఈ మూడింటినీ నమ్మకుండానే మనుషులు తమ దృఢమానసికత కారణముగా ధర్మవర్తనులుగాను, చక్కని క్రమశిక్షణ తోను ఉండగలరు అని వీరు అంటారు. ఒకవేళ వీరు అనేదే నిజమైతే అస్తిత్వమున్న దైవము కూడా చాలా చాలా ఆనందిస్తాడు, ఇంకా మరణానంతరము వీరికి స్వర్గలోకమును ప్రసాదించగలడు! మనుషులందరూ తమ అస్తిత్వమును విశ్వసించాలని, తనను కీర్తించాలని కోరుకునే

రాజకీయ నాయకుల వంటి వాడు కాదు భగవంతుడు. ఈ నిర్ణయాన్ని అనుసరించే విషయములో నాస్తికుల ఐకమత్యము పట్ల భగవంతునికి విశ్వాసము లేదు, ఎందుకంటే వారిలో ఎవరో కొద్దిమంది మాత్రమే ఇలా తమ నిర్ణయమునకు కట్టుబడి ఉండవచ్చును. ఏ నాస్తికుడు ఈ మూడింటి ఉనికిని నమ్మకుండా (యథార్థముగా ఈ మూడు ఉన్నప్పటికీ), సమాజమును దోచుకుని, అంతటా అశాంతిని రేపగలడోనని భగవంతుడు తన ఉనికిని మరియు స్వర్గనరకముల అస్తిత్వమును ప్రతిష్ఠించి సత్కర్మలను వృద్ధి చేస్తాడు మరియు పాపకర్మలను నియంత్రిస్తాడు. ఎప్పుడైనా, రాబోయే కాలములో తలనెత్తే దోషాలను ముందుగానే ఊహించి వాని పరిష్కార ఉపాయములతో సన్నద్ధమవటం మంచిది. ఎలాగైతే ఒక పారిశ్రామిక వేత్త, ఒక పరిశ్రమను స్థాపించి శాంతియుతముగా నడుపుతూ ఉంటాడో అలాగే, భగవంతుడు ఈ సమస్త సృష్టిని సృష్టించి పరిపాలిస్తున్నందున, విశ్వములో శాంతిస్థాపన యందు భగవంతునికి మక్కువ చాలా ఎక్కువ.]

**విజ్ఞాన మౌన మాశ్లాఘ్యం, తన్నిందా యద్వి భూతయః |**
**అన్యథా నాస్తి నో ద్వేషః, ప్రశంసా దోష దర్శనాత్ || 16.13||**

[నాస్తికులు దైవదూషణకు ఒడిగడతారు గనుక, భగవంతుని చేత చేయబడిన యథార్థమైన అద్భుతాలు (మహిమలు) వారిపై దాడి చేయడానికి ఆస్తికులకు ఉపయోగిస్తాయి. విజ్ఞాన శాస్త్రము కూడా యథార్థమైన అద్భుతాల (మహిమలు)ను చూస్తుంది, కాని తర్కబద్ధముగా విశ్లేషించలేని కారణముగా మౌనము వహిస్తుంది. నిజానికి భగవంతుని పట్ల, తన మహిమల పట్ల మౌనము వహించడము ద్వారా విజ్ఞాన శాస్త్రము సరైన పంథాలోనే నడుస్తుంది, ఎందుకంటే ఆ రెండు ఊహించలేనివి, అనూహ్యములు. మౌనమే అనూహ్యమైన భగవంతుని తెలిపెడి సరైన స్పందన అని వేదము కూడా చెప్పుచున్నది (**యతో వాచో..**). కాని నాస్తికుల ఉద్వేగభరితమైనటువంటి తొందర పాటు

ప్రతిస్పందనలను చూసి మేము వారిని కోపగించుకొనుటలేదు, ఎందుకంటే, విశ్వములోని జనుల మధ్య సమన్వయమును స్థాపించి, శాంతి ద్వారా వారందరి ఐక్యత సాధించడమే మన లక్ష్యము. అయితే మహిమలు కొన్ని అసత్యము కావచ్చును అంటే ఇంద్రజాలము వంటివి. కాని వాటిని అసత్యము అని నిరూపించాలి. అన్ని మహిమలూ సత్యమేనని మేము కూడా చెప్పడము లేదు. కాని ఒకవేళ నీవు మహిమలన్నీ అసత్యమైనవే అంటే మాత్రము ఒప్పుకోము. యథార్థముగా మేము కూడా వ్యతిరేకించేవి మరియు అన్ని మతాలలో ఉండే లోపాలను వెతికి, వెలికితీసే నాస్తికులను మేము కూడా అభినందిస్తాము.]

**క్రైస్తవే స పితా దత్తః, జీసస్ రామాది మానవాః |**
**ప్రారంభే సగుణ బ్రహ్మ, నిర్గుణానంతరం మతమ్ || 16.14||**

[క్రైస్తవ మతములో స్వర్గలోకపు తండ్రి అని పిలవబడే తేజోరూపాత్మకుడు, అనూహ్య పరబ్రహ్మమై పరమోత్కృష్టుడుగా నిలిచినవాడు, హిందుమతములో దత్తునకు సరి సమానమైనవాడు. రామానుజులు మరియు మధ్వులు, అనూహ్య పరబ్రహ్మము యొక్క తేజోరూపాత్మకమైన మొదటి అవతారమగు నారాయణుని తోనే మొదలిడతారు. నారాయణుడే దత్తుడు. నరావతారము అయిన జీసస్ అంటే హిందూ మతములో దత్తాత్రేయుడు (మానవ రూపములో అవతరించిన దత్తుడే దత్తాత్రేయుడు), రాముడు, కృష్ణుడు మొదలైనవారి వంటి వాడు. నిర్గుణ పరబ్రహ్మము అనే సిద్ధాంతము క్రైస్తవ మతములో చెప్పబడలేదు. ఈ అంశమును భేదముగా చూపనవసరము లేదు, ఎందుకంటే హిందూమతములో ఉపమతాలైన రామానుజ, మధ్వ మతాలు కూడా అనూహ్య పరబ్రహ్మము యొక్క తేజోరూప శరీరమాధ్యమములతోనే ఆరంభిస్తారు, క్రైస్తవ మతములో స్వర్గలోకపు తండ్రి అనెడి భావన ఇదే.]

**అద్వైత మధ్యమ ద్వైత- వాచో జీసస్ ముఖేరితాః |**
**తేజస్యహం మయీదం చ, తదహం చేతి యుజ్యతే ||16.15||**

[జీసస్ చెప్పినట్లు 'నేను నా తండ్రి ఒకరే' అనునది(నేనే సత్యమును), అద్వైతములో 'అహం బ్రహ్మాస్మి' అను ఆదిశంకరాచార్య తత్త్వమునకు సమానము. జీసస్, తాను భగవంతుని కుమారుడని మరియు తన తండ్రితో రక్తసంబంధము కలిగి ఉన్నాడని చెప్పినప్పుడు, అది రామానుజాచార్యుల విడదీయలేని శేష (అవయవ)-శేషి (అవయవములు కల అవయవి) సంబంధముతో సరిగా సమన్వయము అవుతున్నది. జీసస్, తాను భగవంతుని దూతను అని చెప్పినప్పుడు మధ్వాచార్యులు చెప్పిన సేవ్య-సేవక సంబంధము (భగవంతుడు సేవింపబడ వలసినవాడు-జీవుడు భగవంతుని సేవించవలసిన వాడు) అనెడి ద్వైతమునకు సమన్వయమవుతున్నది. ఇది ఈ ప్రముఖమైన ప్రవచనములతో సమన్వయ పరచవచ్చును. 1. నేను ప్రకాశములో ఉన్నాను. (విడదీయ గలిగే ద్వైతము- మధ్వ సిద్ధాంతము) 2. నాలోనే ప్రకాశము ఉన్నది (విడదీయలేని ద్వైతము లేదా విశిష్టాద్వైతము- రామానుజాచార్యుల సిద్ధాంతము) 3. నేనే ప్రకాశమును (ఆదిశంకరాచార్యుల అద్వైత సిద్ధాంతము).]

**మహమ్మదో దాస్య దూత- త్రైజసా రూపవన్మతమ్ |**
**మధ్వ మార్గోఽత్ర విఖ్యాతః, దయానందార్థ సమ్మితః ||**
**16.16||**

[శంకరుల యొక్క సిద్ధాంతమైన దేవునితో అద్వైతము, రామానుజాచార్యుల యొక్క సిద్ధాంతమైన దేవునితో విడదీయలేన శేష-శేషి సంబంధము మరియు మధ్వాచార్యుల యొక్క సిద్ధాంతమైన దేవునితో సేవ్య-సేవక సంబంధము, క్రైస్తవ మతము మరియు హిందూ మతము రెండింటిలోనూ ఉన్నవి. తేజోరూపాత్మక అవతారము అనెడి సిద్ధాంతము (స్వర్గలోకపు తండ్రి, దత్తుడు) మరియు నరావతారము (జీసస్, రామకృష్ణాదులు) రెండును రెండు మతములలో ఉన్నవి. ఆపైన, ఇస్లాము ఉద్భవించినది. మహమ్మద్ ప్రవక్త నిర్గుణ పరబ్రహ్మము అనెడి సిద్ధాంతమును ప్రతిష్ఠించి, అలవోకగా దైవము నిరాకారుడు అని బోధించారు (నిజానికి

పరబ్రహ్మమైన భగవంతుడు సాకార నిరాకారములకు అతీతుడు, ఎందుకంటే ఆ రెండును ఊహించదగినవే, కాని భగవంతుడు ఊహలకు అందనివాడు, అనూహ్యమైన శక్తి కలవాడు). ఇస్లాములో ఉత్కృష్టమైన దైవమును అల్లాహ్ (అనూహ్య పరబ్రహ్మమునకు సమానము) అని సుమారుగా భావించిననూ, అల్లాహ్ ఒక నిరాకారమైన తేజోరూపముగా కనిపించినది అని చెప్పి మరియు ఇది సాకారము అని భావించబడినది. యథార్థమునకు మహమ్మదు ప్రవక్త జీసస్ వలె అల్లాహ్ యొక్క నరావతారము. కాని ప్రవక్త నరావతారము అనే సిద్ధాంతమును నిరాకరించినాడు, ఎందుకంటే తన అవతరణమునకు కొద్దికాలము ముందు వచ్చిన జీసస్ ను నరావతారము అని చెప్పినందుకు సమాన శరీరమాధ్యమము పట్ల అసూయ గల మతపెద్దలు నరావతారముతో వికర్షించి పరమ క్రూరముగా శిలువ వేసి వధించారు. ప్రవక్త మధ్వాచార్యుల మార్గమునే ఎంచుకున్నారు. మహమ్మదు తనను తాను అల్లాహ్ యొక్క సేవకుడుగాను దూతగాను చెప్పుకున్నాడు. ఇది దయానంద సరస్వతి యొక్క ఉపమతము వలె నరావతారమును నిరాకరించి, నిరాకారుడైన భగవంతుని విశ్వసించునది. మహమ్మదు జీసస్ సిలువ కారణముగాను, దయానందులు అసత్య నరావతారములు కారణముగానూ నరావతార సిద్ధాంతమును నిరాకరించినారు.

స్పష్టీకరణ ఇలా ఉంది: - పరబ్రహ్మము లేదా అనూహ్యమైన దేవుడు హిందూమతములో అంతిమ దేవుడుగా మాత్రమే చెప్పబడినది. కానీ, హిందూమతములోని అన్ని శాఖలు ఉపాధిని ధరించిన అనూహ్యమైన భగవంతుడు మాత్రమే అంతిమ భగవంతునిగా చెప్పుచూ ప్రారంభమైనవి (చైతన్యమును అంతిమ భగవంతునిగా చెబుతున్న శంకరులు కూడా చైతన్యము అను ఉపాధిని ధరించిన పరబ్రహ్మమును ప్రస్తావించిరి). అదేవిధముగా, అన్ని మతాలలో ఉపాధిని ధరించిన భగవంతుడిని మాత్రమే అంతిమ దేవుడుగా ప్రారంభించినవి. పరబ్రహ్మము లేదా

అనూహ్యమైన దేవుడు మూడు స్థితులలో ఉన్నాడు: - 1. అనూహ్యమైన దేవుడు నిరాకారమైన ఆకాశము అను (సూక్ష్మ శక్తి) ఉపాధిని ధరించాడు, ఎందుకంటే ఆకాశము ఎచ్చటనూ కనిపించదు మరియు మానవ రూపముతో సరిహద్దులలో కంటికి కనిపించదు 2. అనూహ్యమైన దేవుడు స్థూల శక్తి అను ఉపాధిని ధరించాడు, కంటికి సర్వత్ర కనిపించేది కానీ సరిహద్దులలో ఎట్టి రూపమూ ఉండదు 3. ఊహించలేని దేవుడు స్థూల శక్తి అను ఉపాధిని ధరించాడు, ఇది సర్వత్ర కనిపిస్తుంది మరియు కంటికి మానవ రూపములో సరిహద్దులలో కూడా కనిపిస్తుంది. మొదటి స్థితి అసలు అల్లాగా తీసుకోబడినది మరియు రెండవ స్థితి అల్లా కాంతిగా కనిపించడము (సర్వత్ర కనిపిస్తున్ననూ సరిహద్దులలో ఏ రూపమూ లేకుండుట.). రెండు రకాల స్థితులు (పైన పేర్కొనబడిన రెండవ స్థితి మరియు మూడవ స్థితి) హిందూమతములో కూడా వేదములో పేర్కొనబడిన 'యక్షుని'గా మరియు దత్తదేవునిగా ఉన్నాయి. క్రైస్తవ మతములో, అంతిమ దేవుడు 'యెహోవా', ఆయన దత్త దేవునితో సమానమైన మూడవ స్థితికి చెందినవాడు.]

### పరబ్రహ్మ వదం మౌనం, బుద్ధస్య శంకరేరితం | శిష్యా నాస్తిక ధీమూఢా, అహింసా ఽగ్ర్యా ప్రవృత్తిగా || 16.17||

[బౌద్ధ మతము నాస్తిక మతము అని అపార్థము చేసుకోబడినది. బుద్ధుడు భగవంతుని పట్ల మౌనము వహించడమును శిష్యులు అపార్థము చేసుకున్నారు. భగవంతుడు అనూహ్యమైన వాడు కావున ఏ పదములు ఆయనను వర్ణించజాలవు, కాబట్టి మౌనమే తనను వ్యక్తీకరించగల ఉత్తమ భావము. ఆదిశంకరాచార్యులు బుద్ధుని మౌనమును విశదీకరిస్తూ పరబ్రహ్మము లేదా అనూహ్య పరమాత్మను వ్యక్తపరచగల సాధనమే మౌనమని బోధించినారు. (**మౌనవ్యాఖ్యా ప్రకటిత పరబ్రహ్మ తత్త్వమ్….**). బుద్ధుడు మరియు జైన మత స్థాపకుడగు ఋషభ దేవుడు జంతువులు మరియు పక్షుల వధకు కారణమైన మాంసాహారమును చాలా

కఠినముగా నిషేధించినారు. ఇదే ప్రాపంచిక జీవనవిధానము లేదా ప్రవృత్తిలో అత్యంత ఉత్తమ న్యాయము (*అహింసా పరమో ధర్మః*). ఇది గోపికలు తమ ఆధ్యాత్మిక జీవితము లేదా నివృత్తి ద్వారా పొందిన గోలోకము వలె పరమోత్కృష్టమైనది.]

**శిష్యస్థాయి వశా ద్భేధః, గురురున్నత మాత్రధీః |**
**కిమర్థం లిఖితం జ్ఞేయం, కిమిత్యేవ న శంకరాత్ || 16.18||**

[ఈ భూమి మీద వేర్వేరు సమయాలలో అవతరించిన దివ్యమైన, ఆధ్యాత్మిక జ్ఞాన ప్రబోధకుల సిద్ధాంతములలో చిన్న మెలికలు ఉండే అవకాశము ఉన్నది. వేర్వేరు మతాలలోని వేర్వేరు ఆధ్యాత్మిక జ్ఞాన ప్రబోధకులు అందరూ ఒకే దైవము యొక్క వేర్వేరు శరీరమాధ్యమాలు మాత్రమే. వేర్వేరు మతములందు వేర్వేరు అవతారములలో బాహ్యములో భేదము కనిపిస్తున్నప్పటికీ, అంతర్లీనమైన దైవములో భేదము లేదు. కావున మనము ఇక్కడ వేర్వేరు మతాలకు చెందిన వేర్వేరు ఆధ్యాత్మిక జ్ఞాన సిద్ధాంతములలో వచ్చిన భేదాలను పరిష్కరించవలసి ఉన్నది. ఈ భేదాలకు కారణమేమిటంటే, వేర్వేరు ప్రాంతాలలోని ఆధ్యాత్మిక జిజ్ఞాసువుల ఆధ్యాత్మిక జ్ఞాన స్థాయి వేర్వేరుగా ఉండటమే. ఒకానొక ప్రాంతములో, ఒకానొక సమయములో ఒకానొక మతానికి చెందిన దివ్య ప్రబోధకుని రూపములో భగవంతుడు అవతరించినపుడు, మొట్టమొదట తనచుట్టు ఉన్న ఆధ్యాత్మిక జ్ఞానము పొందకోరిన వారి జ్ఞాన స్థాయిని అధ్యయనము చేసి, తను బోధించవలసిన ఆధ్యాత్మిక జ్ఞానమును వారి స్థాయికి తగినట్లు మార్పు చేస్తారు. దివ్య ప్రబోధకుడు అసత్యము చెప్పుచున్నాననే విషయము కంటే, తాను చెప్పుచున్న విషయము శిష్యుల స్థాయికి తగినట్లున్నదా? అని, తద్ద్వారా వారు పైకి వచ్చేటట్లు ఇంకొక అడుగు ముందుకు వేయగలరా? అనే విషయమునకే ప్రాధాన్యత ఇస్తారు. అత్యున్నతమైన సత్యము ఆ సమయములోనే తెలుపబడదు. ఇంకా చెప్పాలంటే, సత్యమును కొంచెము మెలివేసి వారి

స్థాయిలోనే చెప్పుదురు. చాదస్తము గల ఆధ్యాత్మిక జ్ఞాన బోధకుడు గురు తత్త్వమును విడనాడి శిష్యుల స్థాయిని పట్టించుకోక, పండితుని వలె, అత్యున్నతమైన పరమ సత్యమునే బోధిస్తాడు. కాబట్టి, దివ్య ప్రబోధకుడు తన భాష్యములలో ఏమి వ్రాసినాడో అని పట్టించుకొనక, అప్పటి సమయములో అలా వ్రాయటానికి ఆయనను ప్రభావితము చేసిన కారణములను విశ్లేషించవలెను. వ్రాయబడిన అంశము ముఖ్యము కాదు, అలా వ్రాయుటకు ప్రేరణ ఏమిటి అనేది ముఖ్యము. ఆదిశంకరాచార్యులు ప్రతి జీవాత్మ మొదటినుండియు భగవంతుడే అని చెప్పినారు. అంటే ఇంకనూ చేయవలసిన ఆధ్యాత్మిక సాధన అంటూ ఏమీ అవసరము లేదు అని అర్థము వస్తున్నది. ఒకవేళ, ఆ సమయములో ఆయన ఎందుకు అలా చెప్పారో అనే కోణములో మనము వివేచిస్తే, మనకు పూర్తి నేపథ్యము బోధపడుతుంది. ఆయన వచ్చిన సమయములో జనులు అందరూ నాస్తికులు. తాము తప్ప వేరే ఎవరినీ భగవంతుడు అని ఒప్పుకోగల మానసిక సంసిద్ధత లేనివారు. కాబట్టి, వారే భగవంతుడు అని చెప్పడము మినహా దారి లేదు. ఎందుకంటే వారు భగవంతుడు, వారు ఉన్నారు కావున భగవంతుడు ఉన్నాడు అని చెప్పడము కంటే వేరే మార్గము లేకపోయినది. ఆదిశంకరాచార్యులు నాస్తికుల చేత భగవంతుడు ఉన్నాడు అని చెప్పేటట్లు చేయగలిగారు. ఇది శిశువును ప్రసవించడానికి చేసిన శస్త్రచికిత్స వలె విజయానికి మొదటి మెట్టు.]

**మతోన్మాద శ్రుతో ఒప్యద్య, శాంతి లక్ష్యః పరాత్పరః |**
**విశ్వసంతో ఒను కర్మాణః, బహవో ద్రైవ హర్షదాః || 16.19||**

[పూర్వము మతోన్మాదము ఎంతగా పెరిగినది అంటే ఒక మతములోని భక్తులు మరొక మతములోని భక్తులను చంపడానికి వెనుకాడ లేదు. హిందూమతములోని ఉపమతముల మధ్య కూడా ఇటువంటి చరిత్రలు ఉన్నాయి. ఇతర మతములలో కూడా ఇదే ధోరణి ఉండటమే నేడు ఉగ్రవాదముకు ఉనికి ఏర్పడినది. మతము

అనేది జీవులకు ప్రాపంచిక జీవితములో ధర్మాధర్మ విచక్షణ అనెడి చైతన్యముతో క్రమశిక్షణను వృద్ధి చేస్తూ, వారిని చివరికి ఆధ్యాత్మిక మార్గమునకు తిప్పి, భగవంతుని యందు సర్వస్వ శరణాగతి చేయువరకు వేసిన మార్గము. ప్రపంచములో శాంతి స్థాపన భగవంతుని పరమోద్దేశము. ఎందుకంటే, భగవంతుని చేత సృష్టి మరియు మృదువైన పరిపాలన అత్యంత శ్రేష్ఠమైన స్థాయిలో జరుగుతాయి. ప్రపంచము మూలమూలల నుండి ఎందరో దివ్య బోధకులు వారి జీవితములను ఈ మార్గమునకు అంకితము చేసి శిఖరాగ్ర స్థాయిలో భగవంతుని మెప్పించి ఆయన నుండి సంపూర్ణ అనుగ్రహమును అందుకున్నారు. అటువంటి ఆధ్యాత్మిక విజయము ప్రపంచములోని అన్ని మతాలను సమన్వయము చేయటము మీద సంపూర్ణముగా ఆధారపడి ఉన్నది.]

**వాచా వాదో మహా దోషో, లిఖితా స్సత్య శోధకాః |**
**సత్యాయోభయ యత్నో ఽయం, జితో లబ్ధః పరో మునిః || 16.20||**

[వేర్వేరు మతాలకు వేర్వేరు ఉపమతాలకు సంబంధించిన సిద్ధాంతములను చర్చించేటప్పుడు, సహనముతో కూడిన చర్చల ద్వారా శాంతియుత పరిష్కారమును పొందవలసి ఉంటున్నది. **సత్యము సతతము శాంతి మరియు సహనములతో కూడి ఉంటున్నది.** ఎప్పుడైనా, వ్రాతపూర్వకమైన చర్చోపచర్చలే, నోటితో చేయు వాద చర్చలకన్నా చాలా చాలా ఉత్తమమైనవి ఎందుకంటే, వ్రాయునపుడు నిశ్చలత్వము ఉంటుంది. కాబట్టి సమాధానము గురించి సహనముతో జాగ్రత్తగా ఆలోచించగలము. అదే నోటితో వాద చర్చలు అయితే ఉద్రిక్తతలో తొందరపాటు సమాధానములు వస్తాయి. అందులో లెక్కలేనన్ని అనుకోని, బాగుచేయలేని పొరపాట్లు జరుగుతాయి. వాటిని దిద్దుకొనుటకు వ్రాత చర్చలలో వలె అవకాశము ఉండదు. చర్చలో పాల్గొనే సాధకులు జయాపజయములు అనే సిద్ధాంతమును కలిగి ఉండరాదు. చర్చలో పాల్గొనే ఇరువర్గాల వారి ప్రయత్నము ఎలా

ఉండాలంటే - ఇద్దరి లాభము కోసము సత్యమును వెలికి తీయడమే చర్చల యొక్క ప్రయోజనమని భావించవలెను. ఓడిపోయిన సాధకుడు గెలిచిన సాధకుని మీద ద్వేషము కలిగి ఉండరాదు, అతని పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. ఎందుకంటే, అతని సహాయము కారణముగా ఓడిన సాధకుడు తన లోపాలను సరిదిద్దుకోగలిగినాడు. విజయము పొందిన సాధకుడు అతిగా ఆనందపడరాదు, ఎందుకంటే గెలిచిన సాధకుడు చర్చ ద్వారా ఎలాంటి అదనపు లాభము పొందలేదు, కావున నిశ్శబ్దముగా ఉండాలి.]

**ఇతి త్రైలోక్యగీతాయాం విశ్వమత సమన్వయ యోగో నామ షోడశాధ్యాయః.**

**ఈ విధముగా త్రైలోక్యగీత యందు పదహారవ అధ్యాయము అయిన విశ్వమత సమన్వయ యోగము పరిసమాప్తము.**